

హిందు మనోభావాలను..

హిందువుల మనోభావాలను దెబ్బతీయడం తగదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

8లో▸



సర్వే సెలవులివ్వాలి

సర్వేలో పాల్గొన్న టీచర్లకు రెమ్యూనరేషన్, సీసీఎల్ సెలవులు మంజూరు చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు.

8లో▸



ప్రాణం తీసిన..

వివాహేతర సంబంధం ప్రాణం తీసింది. కేసును పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు.

8లో▸

న్యూస్‌రీల్

మున్సిపాలిటీ ఏర్పాటు వద్దు



చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మొయినాబాద్: మండలంలోని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దని చిలుకూరు గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు చిలుకూరు బాలాజీ దేవాలయం ఎదుట శనివారం 'మున్సిపాలిటీ వద్దు.. గ్రామ పంచాయతే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. స్వామివారు పాలకుల బుద్ధి మార్చి గ్రామ పంచాయతీలుగానే ఉండేలా చూడాలని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పురాణం వీరభద్ర స్వామి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలను మున్సిపాలిటీలుగా చేయడం ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. పైగా పన్నులు పెరిగి ప్రజలపై భారమే పడుతుందన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జకరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



స్పందన

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న స్పందన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడాపోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు శిరీష తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంఈఓ కిరణ్ కుమార్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం సునీత విద్యార్థినిని అభినందించారు.

న్యూ ఇయర్ వేడుకలపై నిఘా

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సర వేడుకలపై ఎక్సైజ్ పోలీసులు నిఘా పెట్టారు. అనుమతి లేని మద్యం, మాంసం సరఫరా, డ్రగ్స్ వినియోగం తదితరాలపై ఉక్కుపాదం మోపనున్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ పరిధిలో 30–40 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆమోదిత మద్యం మినహా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే న్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగంపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మత్తు పదార్థాలను వినియోగిస్తే నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ (ఎన్‌డీపీఎస్) చట్టం కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అనుమతి లేని ప్రాంతాలు, వాణిజ్య స్థలాల్లో మద్యం వినియోగించరాదని తెలిపారు. బెంగళూరు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చే ట్రావెల్ బస్సులు, వాహనాలతో పాటు రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లలో ఎక్సైజ్ ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. నానాక్‌రాంగూడ, ధూల్‌పేట వంటి ప్రాంతాలపై నిఘా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యం అంత్యోదయ నినాదం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సాక్షి, సిటీబ్యూరో: దేశంలో అట్టడుగు వర్గాల వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నదే అంత్యోదయ ముఖ్య ఉద్దేశమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ప్రస్తుత ప్రధాని మోదీ చాలా కష్టపడి పైకి వచ్చారని తెలిపారు. సమాజం, సర్కారు.. ఈ రెండింటినీ విడదీసి చూడలేమన్నారు. సమాజం కోసం పాలసీ మేకర్స్ పని చేస్తున్నారన్నారు. ప్రపంచంలో సగం మంది మహిళలే ఉన్నారని పేర్కొన్నారు. మహిళా సాధికారకతకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆయా రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రైడ్ అవార్డులు సొంతం చేసుకున్న వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందనరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సూత్రం పట్టుకో.. సులువుగా నేర్చుకో



సండే స్పెషల్

భయం వీడు.. లెక్కలపై పట్టు సాధించు

- సూత్రాలతో లెక్కలు సులువు
- మనసు పెట్టారా పట్టు సాధించినట్టే..
- ఈజీగా చేసేయొచ్చు అంటున్న ఉపాధ్యాయులు
- మ్యాథ్స్‌లో ప్రతిభ చాటుతున్న పలువురు విద్యార్థులు
- నేడు జాతీయ గణిత దినోత్సవం

లెక్కలు.. ఈ మాట వింటే చాలు చాలా మంది విద్యార్థుల్లో ఓ తెలియని భయం.. మ్యాథ్స్ పేరు చెప్పగానే ఎందుకొచ్చిన 'ప్రాబ్లమ్స్' అన్నట్టు ప్రవర్తిస్తుంటారు.. అయితే గణితం అనేది సబ్జెక్ట్ కాదని.. జీవన విధానమని.. మన జీవితంలో ప్రతి క్షణం గణితంతోనే ముడిపడి ఉందని.. చిన్నపాటి ట్రిక్కులతో, సూత్రాలతో సులువుగా అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు పలువురు ఉపాధ్యాయులు. లెక్కలంటే మాకు 'లెక్కేలేదు' అంటున్నారు మరికొందరు విద్యార్థులు.. నేడు జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల సక్సెస్ స్టోరీలు, అభిప్రాయాలతో ప్రత్యేక కథనం..

వివరాలు 8లో▸

క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలి



గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన అధికారులు, నాయకులు

సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ స్టేట్ ఆఫీసర్ భీమయ్య

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ స్టేట్ ఆఫీసర్ భీమయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న 10వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో విశ్వాసాన్ని, నాయకత్వ పటిమను, దృఢసంకల్పాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి తమకు ఇష్టమైన క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. జోనల్ ఆఫీసర్ ఫ్లారెన్స్‌రాణి మాట్లాడుతూ.. నిత్యం క్రీడల సాధనతో శారీరక దృఢత్వం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కమ్మదనం ప్రిన్సిపాల్ విద్యుల్లత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, పీడీలు, పీఈటీలు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేరుకే మున్సిపాలిటీ

- ముగియనున్న పాలకమండళ్ల పదవీకాలం
- కనీస వసతులకు నోచుకోని జనం
- ఇప్పటికీ పూర్తికాని అండర్ డ్రైనేజీ పనులు
- ఇళ్ల మధ్యే ఏరులై పారుతున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



తుర్కయంజాల్: తుర్కయంజాల్ నాలా వద్ద పేరుకుపోయిన మురుగునీరు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏళ్లు గడుస్తున్నా మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోని ప్రజలు ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేకపోతున్నారు. విశాలమైన రోడ్ల సంగతేమో కానీ.. ఆశించిన స్థాయిలో మురుగునీటి కాల్వలు కూడా లేకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడిన మురుగు వీధుల్లో ఏరులై ప్రవహిస్తోంది. స్థానికుల ముక్కు పుటాలను అదరగొడుతోంది. ఈగలు, దోమలకు నిలయంగా మారి ప్రజల అనారోగ్యానికి కారణమవుతోంది.

ఇళ్ల మధ్యే మురుగునీటి ప్రవాహం

జిల్లాలో మూడు మున్సిపల్ కార్పొరేషన్లు సహా 13 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇవి పూర్తిగా నగరానికి అనుకుని ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 363 వార్డులు, 51.05 కిలోమీటర్ల ఓపెన్ డ్రైనేజీలు ఉండగా, 924.37 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, మరో 381.71 కిలోమీటర్ల కచ్చ డ్రైనేజీలు ఉన్నాయి. శంషాబాద్, శంకర్‌పల్లి, జల్‌పల్లి, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ మున్సిపాలిటీల్లో ఆశించిన స్థాయిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల మధ్యే మురుగునీరు ప్రవహిస్తోంది. ఆస్తిపన్ను వసూళ్లు సహా ప్రభుత్వం వివిధ గ్రాంట్ల రూపంలో ఆయా మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నప్పటికీ మౌలిక వసతులు మాత్రం మెరుగుపడటం లేదు. పట్టణ ప్రగతి సహా ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టుల్లో భాగంగా గత ప్రభుత్వం ఆయా మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. ఎస్‌ఆర్‌డీపీ కింద ఇప్పటికే చేపట్టిన పనులు పూర్తి కాలేదు. శంకర్‌పల్లి మెయిన్‌రోడ్డులో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో రెండు కిలోమీటర్ల మేర చేపట్టిన పనులు ఏడాది కాలంగా కొనసాగుతున్నాయి. మీర్‌పేట్, బడంగ్‌పేట మున్సిపాలిటీల్లో డ్రైనేజీ పనులు ఏళ్లుగా సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ముంచుకొస్తున్న ముప్పు

పాలక వర్గాలు ఏర్పడి ఐదేళ్లు పూర్తి కావస్తోంది. జనవరి చివరి వారంతో ఆయా పాలక మండళ్ల గడువు ముగియనుంది. నాలుగేళ్లుగా స్థానికుల అవసరాలను పట్టించుకోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లు మళ్లీ ఎన్నికలు వస్తుండటంతో కొత్త పనుల శంకుస్థాపనకు శ్రీకారం చుట్టారు. ఆఘమేఘాల మీద కౌన్సిల్ మీటింగ్‌లు ఏర్పాటు చేయడం, ఎజెండాలో ఆయా అంశాలను పెట్టి ఏకంగా తీర్మానాలు చేయడం చకచకా జరిగిపోతున్నాయి. ఇంతకాలం ఫంక్షన్‌హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, బహుళ అంతస్తుల భవనాలు, బంధువులు, రియల్టర్ల సేవల్లో తరించిన పాలకులకు అకస్మాత్తుగా ఓటర్లు గుర్తు రావడం, ఆ మేరకు వారి మౌలిక అవసరాలు గుర్తించి, బడ్జెట్ కేటాయింపులు చేయించి శంకుస్థాపనలు చేయిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇళ్ల మధ్య మురుగునీరు



అంతర్జాతీయ గుర్తింపు పొందిన శంషాబాద్ మున్సిపాలిటీలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఇప్పటికీ మెజార్టీ కాలనీల్లో డ్రైనేజీ కాల్వలు లేవు. దీంతో ఇళ్ల మధ్య నుంచే మురుగునీరు ప్రవహిస్తోంది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన ఫిరంగినాలా ప్రస్తుతం పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. మురికి కూపంగా మారింది. డ్రైనేజీ కాల్వలను నిర్మించిక పోవడంతో ఇళ్ల నుంచి వెలువడిన నీరు ఇందులో చేరి దోమలు, ఈగలు, పందులకు నిలయంగా మారింది.

– మంచర్ల శ్రీనివాస్, శంషాబాద్

ఐదేళ్లు చేసిందేమీ లేదు



పాలక మండళ్ల సభ్యులు ప్రజా సంక్షేమాన్ని విస్మరించారు. అనేక సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. ఐదేళ్లుగా ప్రజలను పట్టించుకోలేదు. రియల్టర్లు, బంధువుల సేవలో తరించారు. కన్వెన్షన్లు, ఫంక్షన్‌హాళ్లు, అపార్ట్‌మెంట్ నిర్మాణాల చుట్టే అభివృద్ధి పనులు చేపట్టారు. పరోక్షంగా వారి నుంచి ఆర్థికంగా లబ్ధి పొందారు. సామాన్యులు, పేదలు నివసించే బస్తీలను గాలికొదిలేశారు. బడ్జెట్ లేమి పేరుతో తప్పించుకుని తిరిగారు. ఐదేళ్లలో వారు ఆయా వార్డులకు చేసిందేమీ లేదు.

– ఓరుగంటి యాదయ్య, సీపీఐ నేత

ఆరంభం.. అట్టహాసం



ధ్యానంలో మహిళ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీలు మల్లురవి, నాగరాజు

- ప్రారంభమైన పత్రీజీ ధ్యాన మహాయాగ వేడుకలు
- జ్యోతి ప్రజ్వలన చేసిన ఎంపీలు మల్లురవి, నాగరాజు
- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ధ్యానులు

కడ్తాల్: మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్‌లో శనివారం ధ్యాన జనుల సందడి మధ్య పత్రీజీ ధ్యాన మహాయాగం–3 వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాగర్‌కర్నూల్, కర్నూలు ఎంపీలు మల్లురవి, నాగరాజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిరమిడ్ మాస్టర్లు, దివంగత ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ కూతురు పరిణీత, ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఎంపీ మల్లురవి మాట్లాడుతూ.. ధ్యానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి పత్రీజీ అని, ధ్యానమయ సమాజం కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయనీయమని కొనియాడారు. పత్రీజీ చూపిన ధ్యాన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. ధ్యానంతో ఆరోగ్యంతో పాటు, మానసిక వికాసం పెంపొందుతుందని తెలిపారు. కర్నూల్ ఎంపీ నాగరాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ధ్యాన సాధన చేయాలని, ధ్యానంతో తమ జీవితాలను బాగు చేసుకోవాలని సూచించారు. పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా ధ్యాన యజ్ఞం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.



ధ్యానంలో యువతి

అఖండ జ్యోతికి ఘన స్వాగతం

అంతకు ముందు రాష్ట్రం నలుమూలాల నుంచి తిరిగి వచ్చిన అఖండ జ్యోతికి కడ్తాల్‌లో ధ్యానులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి అఖండ జ్యోతితో పిరమిడ్ వద్దకు ర్యాలీగా సాగారు. పలువురు పిరమిడ్ మాస్టర్ల సందేశాలు, సంగీత కార్యక్రమాలు అలరించాయి. ధ్యానులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ట్రస్టు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన ధ్యానులు



సంగీత ధ్యానంలో కళాకారులు

వ్యవసాయాభివృద్ధికి కాంగ్రెస్ సర్కారు కృషి

కాచిగూడ: వ్యవసాయాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో 'పాడినేల వ్యవసాయం – సమస్యలు, సవాళ్లు' అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో వర్షపాతం తక్కువగా ఉండటంతో నీరు లేక భూములు డ్రైల్యాండ్‌గా మారి పంటలు పండక ప్రజలు వలస వెళ్లే వారని అన్నారు. ప్రస్తుతం భూములను సారవంతం చేయడంతో ఆ పరిస్థితిని అధిగమించి పంటలను పండిస్తున్నారని తెలిపారు. మేధావులు, యువత వ్యవసాయ రంగంపై ప్రజలకు అవగాహన పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. సదస్సులో తెలంగాణ ఎకనమిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.ముత్యం రెడ్డి, యూఓహెచ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ శ్రీజిత్ మిశ్రా, సీఈఎస్ఎస్ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ.రేవతి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న చిన్నారెడ్డి తదితరులు

చెరసాల నుంచి.. చేనుబాట

- పొలం పనుల్లో లగచర్ల గిరిజన రైతులు బిజీ
- నరకం నుంచి విముక్తి కలిగిందంటున్న కర్షకులు
- గ్రామాల్లో నెలకొన్న ప్రశాంత వాతావరణం



జైలు నుంచి వస్తున్న తమవారి కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

దుద్యాల్: ఆటపాటలతో నేల తల్లి ఒడిలో జీవనం సాగించే గిరిజనులకు లగచర్ల ఘటన వారి జీవితాల్లో మరిచిపోలేనిది. తమ భూములను కాపాడుకోవడానికి జరిగిన పోరాటంలో చోటుచేసుకున్న పొరపాటుకు జైలు పాలైన లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంటతండాలకు చెందిన రైతులు.. 37 రోజులుగా జైలు జీవితం గడిపారు. కటకటాల నుంచి శుక్రవారం విడుదలైన కర్షకులు.. శనివారం తమ కుటుంబ సభ్యులతో కలిసి పొలం బాట పట్టారు.

జీవితంపై విరక్తి కల్గింది

కటకటాల్లో ఉన్నన్ని రోజులు బతుకుపై విరక్తి కలిగింది. నిత్యం ఏదో ఒక పని చేసుకుని ప్రశాంతంగా జీవించే నేను.. జైలు పాలు కావడంతో నా కుటుంబం మనోవేదనకు గురయింది. పంచాయితీతో ప్రమేయం లేకున్నా పోలీసులు తీసుకెళ్లారు. 37 రోజులు నిద్రహారాలు లేకుండా గడిపాను. ఇటీవలే ప్రేమ వివాహం చేసున్నాను. కుటుంబానికి దూరంగా ఉండడం కంటే చచ్చిపోవడం మేలనిపించింది. పొలానికి రాగానే పశువులు నన్ను చూసి అరిచాయి. దాంతో నాకు ఏడుపు వచ్చింది. సంతోషంగా వాటికి స్నానం చేయించాను.

– వినోద్ నాయక్, రోటి బండ తండా

పొలం చూడననుకున్నా..



బంధీఖానాలో గుండెపోటు వచ్చినప్పుడు ఇక బతకను, పొలంను చూడను అనుకున్న. అదృష్టం బాగుండి బతికి బయటపడి ఊరుకొచ్చాను. కంది పంటను 10 రోజుల క్రితమే కోసేదుండే. కానీ.. కుటుంబీకులు నావద్దకు వచ్చేసరికి పనులు ఆగిపోయాయి. ఇప్పుడు పొలం పనులు చేయండం సంతోషంగా ఉంది. భూమి కోసం జైలు పాలయ్యాం. నేలతల్లితోనే మా జీవితాలు. మా భూముల జోలికి రావొద్దు.

– హీర్యా నాయక్(గుండెపోటు వచ్చిన వ్యక్తి), పులిచర్లకుంద తండా

జైలు జీవితం నరకం



జైలు జీవితం ఒక నరకం. పొలం పనుల్లో ఉండే మేము.. కటకటాల్లో ఉండలేకపోయాం. సరిగా నిద్రపోలేదు. తిండి తినలేకపోయాం. ఒకానొక సందర్భంలో చనిపోవాలని అనిపించింది. బెయిల్ వచ్చింది అనగానే కంటి నిండ నిద్ర పోయాను. ఇంటికి వచ్చిన తర్వాత పొలంను చూడాలని శనివారం నిద్ర లేవగానే వెళ్లాను. అక్కడికి వెళ్లగానే ఏడుపు వచ్చింది. వరి నారు వేసేందుకు సిద్ధమవుతున్నాము.

– హీర్యా నాయక్, పులిచర్లకుంట తండా

సండే స్పెషల్

సూత్రం పట్టుకో.. సులువుగా నేర్చుకో


జిల్లా స్థాయి గణిత వైజ్ఞానిక ప్రదర్శనలో మొదటి బహుమతి అందుకుంటున్న శృతి (ఫైల్)

చేవెళ్ల: మాథ్స్ అనేది ఇష్టంతో నేర్చుకుంటే ఎంతో సులువుగా, సరదాగా ఉంటుందని అంటున్నారు మండలంలోని ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గణిత ఉపాధ్యాయుడు అమ్మన్నరావు. గణిత పితామహుడు రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్నట్టు చెబుతున్నారు. బేసిక్ మాథ్స్, లాజిక్ థింకింగ్‌తో కోడింగ్ జోడించటం ద్వారా ఏదైనా సాధించవచ్చని తెలిపారు. ఇటీవల శంషాబాద్ నర్కుడలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత, వైజ్ఞానిక ప్రదర్శనలో తమ పాఠశాలకు చెందిన జి. భరత్‌కుమార్, బి.శృతి అనే విద్యార్థులు మొదటిస్థానంలో నిలిచారని చెప్పారు. 'యాంటీ హాకింగ్ కోడ్ విత్ సీజర్' పేరుతో విద్యార్థులు ప్రదర్శన ఇచ్చినట్టు వివరించారు.

ఇష్టంగా నేర్చుకుంటాం




బేసిక్ మాథ్స్‌తోనే కంప్యూటర్‌లో డేటా ఎంట్రీ చేయడం జరుగుతుంది. డేటా స్ట్రక్చర్ కోడింగ్ విభాగంలో నైపుణ్యం సాధిస్తే అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చు. గణిత ఉపాధ్యాయులు చూపించిన ఈ పోగ్రాం జిల్లాస్థాయిలో మొదటి బహుమతి సాధించి పెట్టింది. రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఎంతో సంతోషంగా ఉంది. ఇది మా ఉపాధ్యాయుల ప్రోత్సాహమే. ఎంతో ఇష్టంగా మాథ్స్ నేర్చుకుంటున్నాం. – జి.భరత్‌కుమార్, బి.శృతి, 9వ తరగతి, ఆలూరు ప్రభుత్వ పాఠశాల

కార్తీక్.. గణితంలో సూపర్బ్


జిల్లా స్థాయి గణిత ప్రతిభా పోటీల్లో సత్తా చాటిన కార్తీక్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: గణితం అంటే చాలా కష్టమని అంతా అనుకుంటుంటారు. కానీ ఆ విద్యార్థి మాత్రం అందులోనే ఆసక్తిని పెంచుకున్నాడు. మాస్టారు చెప్పిన గణిత గుణాంకాలపై పట్టు సాధిస్తున్నాడు. మండల, జిల్లా స్థాయిలో నిర్వహించిన మ్యాథమెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలను అందుకున్నాడు. ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాల గ్రామానికి చెందిన శ్రీను, యశోద దంపతుల కుమారుడు కార్తీక్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి లెక్కలపై ఆసక్తిని పెంచుకున్నాడు. లెక్కల్లో తోటి విద్యార్థులకన్నా మంచి మార్కులు సాధిస్తూ గణితంపై పట్టు సాధిస్తున్నాడు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే అన్ని సబ్జెక్టులకంటే గణితం ఎంతో సులువు అని నిరూపిస్తున్నాడు. లెక్కలపై వేసిన ప్రశ్నలకు సునాయాసంగా జవాబులు చెబుతూ ఉపాధ్యాయులతో ప్రశంసలు అందుకుంటున్నాడు. ఇటీవల నిర్వహించిన మండల, జిల్లా స్థాయి మాథమెటిక్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నాడు.

ఇష్టంతో నేర్చుకోవాలి



మహేశ్వరం: గణితం నేర్చుకోవడాన్ని ఒక హాబీగా తీసుకుంటే సులభంగా అర్థం చేసుకోవచ్చు. దీన్ని ఒక సబ్జెక్టుగా కాకుండా జీవితంలో ఒక భాగంగా నేర్చుకోవాలి. గణితం మనిషిలోని ఆలోచనా శక్తిని, తార్కికతను పెంచుతుంది. జీవితంలో వచ్చే సమస్యలను సులభంగా, భయం లేకుండా పరిష్కరించుకునే శక్తిని ఇస్తుంది. మనిషి మేధస్సు పెరగడానికి ఉపయోగపడుతుంది. ఒకేసారి అన్ని నేర్చుకోవాలనుకోవద్దు. మెట్లు ఎక్కినట్లు ఒక్కోటి సాధన చేయాలి.

– కె.చైతన్య, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాల, అమీర్‌పేట్

కృత్య పద్ధతి ద్వారా సులభం



మహేశ్వరం: ప్రయోగపూర్వకంగా వివరించి చెబితే గణితం విద్యార్థులకు సులభంగా అర్థమవుతుంది. చదవడం, సాధన చేయడం కంటే కృత్య పద్ధతిలో ముందుకెళ్తే మరింత సులభం. గణిత సూత్రాలను సులువుగా అర్థం చేసుకోవడానికి ప్రయోగాలు ఉపయోగపడుతాయి. విజువల్స్, మోడల్స్, చార్ట్‌ల ద్వారా బోధిస్తే తొందరగా అర్థమవుతుంది. సబ్జెక్టుపై మరింత ఆసక్తి పెరుగుతుంది. చార్ట్స్, త్రీడీ మోడల్స్, గ్రాఫ్ షీట్స్, జామెట్రీ బాక్స్‌లోని పరికరాలను ఉపయోగించి నేర్పిస్తాం. రేఖా గణితం, బీజగణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంఖ్యాక శాస్త్రానికి సంబంధించి బోధనోపకరణాలతో బోధిస్తే సులభంగా అర్థమవుతుంది.

– పి.మధుసూదన్‌రెడ్డి, గణితశాస్త్ర ఉపాధ్యాయుడు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, జెడ్పీహెచ్‌ఎస్ పెండ్యాల

రాష్ట్రస్థాయి ప్రతిభ పరీక్షకు ఇర్విన్ విద్యార్థి


ఆకుతోట స్నోహిత్

మాడ్గుల: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత ప్రతిభ పరీక్షలో రాష్ట్ర స్థాయికి ఇర్విన్ విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు శనివారం తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పరీక్షలో జిల్లా ఉన్నత పాఠశాలకు చెందిన ఆకుతోట స్నోహిత్ ప్రథమ స్థానం సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

గణితం.. మానవ ప్రగతికి మూలం



ఇబ్రహీంపట్నం: గణితశాస్త్రం మానవ ప్రగతికి మూలం. మనకు తర్కబద్ధమైన ఆలోచన, విశ్లేషణాత్మక దృక్పథం, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వస్తుంది. గణితంలో విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలు చాటేందుకు వివిధ పద్ధతుల్లో బోధన చేస్తున్నాను. కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, అంతరిక్ష పరిశోధన వంటి రంగాలు గణిత శాస్త్రం ఆధారంగానే అభివృద్ధి సాధిస్తున్నాయి. కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నాయి.

– శ్రీనివాస్, గణిత ఉపాధ్యాయుడు, చర్లపటేల్‌గూడ, జెడ్పీహెచ్‌ఎస్

గణితంలో ప్రావీణ్యం.. భవితకు సోపానం



ఇబ్రహీంపట్నం: గణితంలో ప్రావిణ్యం సాధిస్తే భవిష్యత్తుకు చక్కటి పునాదులు వేసుకోవచ్చు. విద్యార్థులకు గణితంపై అవగాహన పెంపొందించి.. వారిలో ఆసక్తిని రేకెత్తించేందుకు మన పరిసరాలు, చుట్టూ ఉన్న అంశాలనే ప్రామాణికంగా తీసుకోని బోధిస్తాను. చార్ట్స్, డిజిటల్ క్లాస్‌ల ద్వారా వారికి అర్థంకాని అంశాలను ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తాను. విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేస్తాను.

– గిరిజ, గణిత ఉపాధ్యాయురాలు, బాలికల జెడ్పీహెచ్‌ఎస్, ఇబ్రహీంపట్నం

నీరజ్ 'టాలెంట్'



ఇబ్రహీంపట్నం: చర్లపటేల్‌గూడ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కప్పపహాడ్ గ్రామానికి చెందిన నీరజ్ మాథ్స్‌లో 'టాలెంట్' చాటుతున్నాడు. ఈనెల 16 జరిగిన మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ నెల 19న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానాన్ని దక్కించుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తమ మ్యాథ్స్ టీచర్ శ్రీనివాస్ చక్కని బోధనతో తనకు గణితంపై ఆసక్తి పెరిగిందని చెబుతున్నాడు. ఉపాధ్యాయులు చెప్పింది శ్రద్ధగా విని, సాధన చేస్తే గణితమంత సులువైన సబ్జెక్ట్ ఏదీలేదంటున్నాడు.

ఆకట్టుకునేలా.. ఆసక్తి పెంచేలా



ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు నిత్య జీవిత ఉదాహరణలతో వారిని ఆకట్టుకునేలా బోధించే ప్రయత్నం చేస్తుంటాను. పిల్లలు నేర్చుకునేలా పాఠశాల గోడలపై, మెట్లపై గణిత సూత్రాలను రాయించి ప్రొత్సహిస్తున్నాను. బోధనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నాం. ఐదేళ్లుగా మా పాఠశాలలో గణిత శాస్త్రంలో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధిస్తున్నారు. మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో రాణిస్తున్నారు.

– సురేష్, గణితశాస్త్ర ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇబ్రహీంపట్నం

లెక్కలంటే భయపడను



ఇబ్రహీంపట్నం: భయపడితే ముందుకు వెళ్లలేము. లెక్కలంటే భయపడను. నాకు అర్థంకాని విషయాలను గణిత మాస్టార్‌లను అడుగుతాను. వారు ఎంతో ఓపికతో మాకు అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు. గణితంపై ఎంతో ఆసక్తి పెరిగింది. గణితాన్ని జోడించి రంగోళిలాంటి ఆసక్తికర పోటీలను నిర్వహించుకుంటున్నాం. చార్ట్స్, డిజిటల్ విధానంలో తరగతులను బోధిస్తుండడంతో సులువుగా నేర్చుకునే అవకాశం దక్కింది.

– శ్రావణి, బాలికల జెడ్పీహెచ్‌ఎస్, ఇబ్రహీంపట్నం

సర్వే సెలవులు మంజూరు చేయాలని వినతి


ఎంపీడీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: గత నెలలో ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్, సీసీఎల్ సెలవులను మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ బన్సీలాల్‌కు యూటీఎఫ్ నాయకలు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులు తమ సెలవులను కోల్పోయి ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా పాలుపంచుకొని సర్వేను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్ణయించిన రెమ్యూనరేషన్‌ను ఉపాధ్యాయుల ఖాతాలో జమ చేయడంతో పాటుగా సెలవు రోజుల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు సీసీఎల్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బిజిలి సత్యం, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, నాయకులు అరుణ, కృష్ణ, బాలయ్య, వేణు, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మనవడికి లంచ్ బాక్స్ తీసుకెళ్లిన వృద్ధుడి అదృశ్యం


బాబురావు బిరదర్(ఫైల్)

పహాడీషరీఫ్: మనవడికి లంచ్ బాక్స్ ఇచ్చేందుకు పాఠశాలకు వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాం కాలనీ నిత్య ఎన్‌క్లేవ్‌కు చెందిన బాబురావు బిరదర్(62) ఈ నెల 20న ఉదయం 11.55 గంటలకు స్థానికంగా ఉన్న శ్రీ చైతన్య హైస్కూల్‌లో చదివే మనవడికి లంచ్ బాక్స్ ఇచ్చేందుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. బాబురావు తొమ్మిది నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని కుమారుడు బిరదర్ అమోల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో లేదా, 87126 62367 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

గర్భిణి మృతికి కారణమైన వ్యక్తికి పదేళ్ల జైలు

శంకర్‌పల్లి: మద్యం మత్తులో బైక్ నడిపి, ఐదు నెలల గర్భిణి మృతికి కారణమైన వ్యక్తికి ఎల్‌బీనగర్ కోర్టు పదేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. 2021లో చేవెళ్ల మండలం కందవాడ గ్రామానికి చెందిన ఫిరంగి రవి, తన భార్య లక్ష్మిని ఆస్పత్రిలో చూపించేందుకు శంకర్‌పల్లికి వచ్చాడు. ఇద్దరూ బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రామంతాపూర్ వద్ద వెనక నుంచి మద్యం మత్తులో, అతివేగంగా బైక్‌పై వచ్చిన మాదారం వాసి అనిల్‌కుమార్ (24) వీరిని బలంగా ఢీకొట్టాడు. దీంతో లక్ష్మి బైక్‌పైనుంచి కిందపడిపోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో ఆమెను శంకర్‌పల్లి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. శనివారం ఎల్‌బీనగర్ సెషన్స్ కోర్టు జడ్జి హరీష నిందితుడు అనిల్ కుమార్‌కు పదేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించింది.

హిందువుల మనోభావాలను దెబ్బ తీయొద్దు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


తోల్‌కట్ట చౌరస్తాలో ధర్నాలో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్: హిందువుల మనోభావాలను దెబ్బతీయొద్దని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తోల్‌కట్ట సమీపంలో ఉన్న హనుమాన్ దేవాలయం నుంచి శుక్రవారం రాత్రి దుండగులు విగ్రహం, పూజా సామగ్రి బయట పడేయడంపై బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఇలాంటి చర్యలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. రెండుమూడు రోజుల్లో దుండగులను పట్టుకొని కేసులు నమోదు చేస్తామని నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి, తోల్‌కట్ట మాజీ సర్పంచ్ శ్రీనివాస్, హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ అంజయ్య, నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం


వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్ కుమార్


దాడికి ఉపయోగించిన కర్ర, ఇనుప సీకు

- మహిళ హత్య కేసును ఛేదించిన షాద్‌నగర్ పోలీసులు
- నిందితుడికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయ్ కుమార్

షాద్‌నగర్ రూరల్: మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు.. ఆమెపై అనుమానం పెంచుకున్నాడు.. కన్నకూతురు ముందే తల్లిపై దాడి చేశాడు. దెబ్బలు తాళలేక మహిళ అక్కడే మృతిచెందింది. విషయం బయటకు తెలిస్తే కటకటాల పాలవుతానని గ్రహించి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు వారం రోజుల్లో కేసును ఛేదించి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన పావని (35) తన కూతురు జ్యోతిశ్రీతో కలిసి కొంతకాలం క్రితం షాద్‌నగర్‌కు వచ్చింది. పట్టణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తూ కూతురుతో కలిసి రైల్వేస్టేషన్, జాతీయ రహదారి సమీపంలో నివసిస్తోంది. కర్నూలు జిల్లా ఆలూర్ మండలం జోలాపూర్ గ్రామానికి చెందిన వడ్డె వెంకటేశ్ షాద్‌నగర్‌లో కూలీ పని చేస్తూ పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఉండేవాడు. ఈ నేపథ్యంలో పావనికి వెంకటేశ్‌తో పరిచయం ఏర్పడింది. కొంత కాలం తర్వాత ఇది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈనెల 15న రాత్రి సమయంలో బుచ్చిగూడ రోడ్డులోని బైపాస్ బ్రిడ్జి కింద నిద్రిస్తున్న పావనితో వెంకటేశ్ గొడవ పడ్డాడు. నిన్న (14వ తేదీ) ఎక్కడికి వెళ్లావని మృతురాలు పావనితో వాగ్వాదానికి దిగాడు. తన సొంత ఊరులో ఉన్న భర్త వద్దకు వెళ్లానని చెప్పడంతో కోపోద్రిక్తుడైన వెంకటేశ్ కర్రతో అమానుషంగా ఆమెపై దాడి చేశాడు. అప్పటికీ పావని మృతి చెందలేదని తెలుసుకుని ఇనుప సలాకతో తల, నుదుటిపై కొట్టడంతో రక్తస్రావమై చనిపోయింది. తల్లిపై దాడి చేస్తుండగా అడ్డు వచ్చిన జ్యోతిశ్రీపై కూడా దాడి చేశాడు. పోలీసులకు తెలిస్తే నేరం బయట పడుతుందని భావించిన వెంకటేశ్ తెల్లవారిన తర్వాత.. నీకు టీ తెస్తా నువ్వు అమ్మ దగ్గరే ఉండూ అంటూ జ్యోతిశ్రీకి చెప్పి సొంతూరుకు పారిపోయాడు. మహిళ హత్య కేసుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. వెంకటేశ్ కర్నూల్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. హత్యకు ఉపయోగించిన కర్ర, ఇనుప సలాక(సీకు)ను స్వాధీనం చేసుకున్న పోలీసులు వెంకటేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్ పర్యవేక్షణ, ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రధాన పాత్ర పోషించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శరత్‌కుమార్, పోలీసు సిబ్బంది కరుణాకర్, రఫీ, మహేశ్, రాజును అభినందించారు.